




జిల్లాలోని గూడూరు అభయారణ్యం

తునికి చెట్టుకు నిప్పు (ఫైల్)

గూడూరు అభయారణ్యంలో నరికివేతకు గురైన టేకు చెట్లు

అడవి తల్లికి గుండె కోత

గొడ్డలి వేటుకు బలవుతున్న అభయారణ్యం

» యథేచ్ఛగా కలప స్మగ్లింగ్ » అటవీశాఖలో సిబ్బంది కొరత » తరిగిపోతున్న వనసంపద

గూడూరు, జూన్ 10 : దట్టమైన అటవీ ప్రాంతంగా పేరొందిన జిల్లాలోని అడవులు రోజు రోజుకు తరిగిపోతున్నాయి. అడవులను రక్షిస్తున్నాం.. ఎప్పటికప్పుడు గొడ్డలి వేటుకు బలికాకుండా చూస్తున్నాం.. స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తున్నామంటూ అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నారు. వాస్తవ పరిస్థితుల్లో మాత్రం వనసంపద తరిగిపోతోంది. వందల సంఖ్యలో కేసులు నమోదు చేస్తూ వెనువెంటనే పర్యవేక్షిస్తున్నామని చెబుతున్నా.. అడవుల నరికివేత యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. తరుగుతున్న వనాల కారణంగా మానవాళి కాలుష్య కోరల్లో చిక్కుకుని విలవిల లాడుతోంది. మహబూబాబాద్ జిల్లాలో ఏడు రేంజ్‌ల పరిధిలో 2,92,236 హెక్టార్ల పరిధిలో భౌగోళిక విస్తీర్ణం ఉంది. ఇందులో 1,31,530.22 హెక్టార్ల విస్తీర్ణంలో అటవీప్రాంతం ఉంది. ఇందులో 48,536.43 హెక్టార్ల విస్తీర్ణం పోడుకు గురైంది. జిల్లా పరిధిలో అటవీ విస్తీర్ణం 45 శాతం ఉంది. కలప స్మగ్లర్ల ద్వారా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. ఈ చర్యలకు పాల్పడిన అక్రమార్కులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

టేకు వనాలు.. మైదానాలుగా...

మహబూబాబాద్ జిల్లాలో కలప అక్రమ రవాణా దందా యథేచ్ఛగా సాగుతోంది. స్మగ్లర్ల గొడ్డలి వేటుకు వేల హెక్టార్లలో అటవీ సంపద మాయమవుతోంది. టేకు వనాలు మైదానాలుగా మారుతున్నాయి. ప్రభుత్వం హరితహారంలో మొక్కలు నాటుతుంటే అడవుల్లో ఏపుగా పెరిగిన వృక్షాలను అక్రమార్కులు నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అటవీశాఖలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడుతోందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా, అటవీశాఖ సహజ సిద్ధమైన అడవుల రక్షణలో శ్రద్ధ చూపకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ముఖ్యమైన జాతుల కలప కనుమరుగు..

రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలోనే అధిక శాతం అడవులు హారతికర్పూరంలా కరిగిపోతున్నట్లు నిపుణుల సర్వేలో వెల్లడైంది. మహబూబాబాద్ జిల్లా అడవుల్లో ముఖ్యమైన కలప జాతుల రకాలు టేకు, జిట్రేగి, పెద్దేగి, మద్ది, తునికి, బిల్లుడు, చెన్నంగి చెట్లు కనుమరుగవుతున్నాయి. గూడూరు సబ్‌డివిజన్ పరిధిలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, మహబూబాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని బయ్యారం, మహబూబాబాద్ రేంజ్ పరిధిలోని టేకు వనాలు, అటవీ ప్రాంతాల్లో కొందరు స్మగ్లర్లు టేకు చెట్లను నరికివేస్తూ వ్యాపారం సాగిస్తున్నారు. నిత్యం రోడ్డు మార్గంలో అటవీ గ్రామాల ప్రజలు, అటవీ సిబ్బంది పర్యటిస్తున్నా.. కలప అక్రమ రవాణా ఆగడం లేదు. ప్రస్తుతం ఏపుగా పెరిగిన టేకు చెట్లను కొందరు స్మగ్లర్లు రంపపు కోత యంత్రాలతో రాత్రి పూట నరికివేస్తున్నారు. నరికివేతకు గురైన టేకు చెట్ల మొదళ్లపై నెంబర్లు వేస్తూ అటవీ సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. ఇదిలా ఉంటే అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షించే జామాయిల్ ప్లాంటేషన్లను కూడా అక్రమార్కులు వదలడం లేదు. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పోడు పేరుతో జామాయిల్ ప్లాంటేషన్‌లో ఉన్న చెట్లను నరికి వేస్తున్నారు. ఈ సంఘటనలపై అటవీశాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి కేసులు నమోదు చేశారు.



పట్టుబడిన టేకు దుంగలు

చెట్ల నరికివేతను అడ్డుకుంటున్నాం..
- చంద్రశేఖర్, ఎఫ్‌డీవో గూడూరు



అడవుల నరికివేత.. ఆక్రమణలు జరుగకుండా పకడ్బందీగా అడ్డుకుంటున్నాం. గతంలో కంటే ఇప్పుడు చాలా వరకు కలప అక్రమ రవాణాను నిరోధించాం. అటవీశాఖ సిబ్బంది, బేస్‌క్యాంపు, పెట్రోలింగ్ నిర్వహిస్తూ అందిన సమాచారంతో వెంటనే దాడులు చేస్తూ స్మగ్లర్లపై కేసులు నమోదు చేస్తున్నాం. కలప అక్రమ రవాణాలో తమ సిబ్బంది ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటాం.

మంత్రి పొన్నంను కలిసిన ఎంపీ బలరాం నాయక్



హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మొక్క అందజేస్తున్న ఎంపీ బలరాం నాయక్

మహబూబాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం మానుకోట పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజారిటీతో గెలిచిన బలరాంనాయక్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి మొక్క అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీ బలరాంనాయక్‌ను అభినందించారు.



కలెక్టరేట్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

» కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 113 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి వచ్చి దరఖాస్తులు ఇస్తారని, వాటిని పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిశీలించి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా, పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సుమారు మూడు నెలల పాటు జిల్లాలో గ్రీవెన్స్ సెల్ నిర్వహణకు బ్రేక్ పడింది. ఈ నెల 6న ఎన్నికల కమిషన్ కోడ్ ఎత్తివేయడంతో కలెక్టరేట్‌లో సోమవారం తిరిగి గ్రీవెన్స్ సెల్‌ను నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు అధికారులకు తమ దరఖాస్తులను అందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, జడ్పీ సీఈవో నర్మద, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

18ఏళ్లు పైబడిన వారికి బీసీజీ టీకా అందించాలి

» డీఎంహెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూన్ 10 : జిల్లాలో 18 సంవత్సరాలు పైబడిన వారందరికి బీసీజీ టీకా అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి వైద్యాధికారులకు సూచించారు. మహబూబాబాద్‌లోని ఐఎంఏ హాల్‌లో సోమవారం బీసీజీ టీకాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళావతిబాయి మాట్లాడుతూ... జిల్లాలోని పల్లె దవాఖానాలు, పీహెచ్‌సీలు, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు, నోడల్ అధికారులు బీసీజీ టీకాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలోని 18 సంవత్సరాలు పైబడిన వారందరికి బీసీజీ టీకాలు వేసేందుకు కార్యాచరణ తయారు చేయాలన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఆరోగ్య కేంద్ర స్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. బీసీజీ వ్యాక్సిన్ సార్వత్రిక వ్యాధికి నిరోధక టీకాగా చిన్నపిల్లలకు ఇచ్చేదని, పెద్దవాళ్లకు అడల్ట్ డోస్ ఇస్తారని, ఎలాంటి అపోహలు పడొద్దని కోరారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు వెల్నెస్ వ్యాక్సినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరెవరికి ఇవ్వాలనేది సర్వే ఆధారంగా గుర్తించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబరీష, మురళీధర్, విష్ణు, బిందు, కృష్ణార్జున్‌రావు, కెవి.రాజు, వడ్డెబోయిన శ్రీనివాస్, మంగమ్మ, సౌమిత్, నీలిమ, శ్వేత, అశోక్ పాల్గొన్నారు.



వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

» వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

తొర్రూరు, జూన్ 10: గ్రామాల్లో వ్యవసాయ సీజన్‌లో రైతులకు అనుసంధానంగా ఉండే ఏఈవోల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ రైతులు తొర్రూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని హరిపిరాల, వెలికట్టె, అమ్మాపురం క్లస్టర్ పరిధిలోని రైతులు డివిజన్ కేంద్రానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఏవో కుమార్ యాదవ్ అవినీతికి పాల్పడితే ముగ్గురు ఏఈవోలను సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. వ్యవసాయ శాఖ తీరుతో తాము ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. గత నెలలో ఐదు రోజుల పాటు ఏవో కుమార్ జీలుగ విత్తనాలు నేరుగా పక్క రాష్ట్రాలకు అమ్ముకుని తప్పించుకోవాలని కింది స్థాయి ఉద్యోగులైన ఏఈవోలను లాగడంతో వారికి అన్యాయం జరిగిందన్నారు. విచారణ అధికారిగా వచ్చిన ఏడీఏ కూడా సరైన విచారణ చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే విజిలెన్స్ అధికారులచే విచారణ చేపట్టి ఏఈవోలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మాలోత్ సురేష్ బాబు, ఐలయ్య, భూపతి, రాజేందర్, రాజబాబు, బిల్యా నాయక్, లాల్‌సింగ్, కిష్టు, పద్మ, కాళి, స్వాతి, పూలమ్మ, కమలమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపు వాహనాల వేలం

గూడూరు, జూన్ 10 : గూడూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన ఆయా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ భిక్షపతి తెలిపారు. ఈ వాహనాల వేలం పాట జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేలం పాటలో ఒక లారీ, వ్యాన్, టాటా మ్యాక్సిమో, మరికొన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు లారీ, వ్యాన్‌కు రూ.50వేలు, ద్విచక్ర వాహనాలకు రూ.20వేల చొప్పున ఈఎండీగా ఒక్కో వాహనానికి విడివిడిగా 11న ఉదయం చెల్లించి వేలంలో పాల్గొనాలని సీఐ భిక్షపతి కోరారు.

సదరం స్లాట్ కోసం దరఖాస్తులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : దివ్యాంగుల వైద్య నిర్ధారణ పరీక్షల కోసం అర్హులైన దివ్యాంగులు మీసేవ కేంద్రాల ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12న రెన్యువల్స్ కోసం 150 మందికి, 19న కొత్త వాటికోసం 150 మందికి, 26న రెన్యువల్ చేసుకునే వారికి 150 వెరసి మొత్తం 450 మంది స్లాట్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో మతిస్థిమితం(ఎంఆర్), దృష్టిలోపం(వీఐ), ఆర్థోపెడిక్(ఓహెచ్) విభాగాల్లో లోపం ఉన్న దివ్యాంగులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పత్తిపాక రోడ్డు పనులను పూర్తిచేయాలి

» ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మహబూబాబాద్‌లోని పత్తిపాక రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూన్ 10 : పత్తిపాక రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తిపాక రోడ్డు విస్తరణ పనులను సోమవారం పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. రోడ్డు పనుల ఆలస్యానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. పత్తిపాక రోడ్డు పనుల్లో వేగం పెంచి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో అటు నుంచి వెళ్లే వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, డీఈ ఉపేందర్, ఏఈ సురేష్, విద్యుత్ డీఈ విజయ్, కౌన్సిలర్లు గుండా స్వప్నరాజశేఖర్, ఎడ్ల వేణుమాధవ్, కాంగ్రెస్ నాయకులు ఎమ్డీ.హరుణ్, నీరుటి సురేష్‌నాయుడు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులను పరిశీలించిన చైర్మన్

మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ నుంచి ఈదులపూసపల్లి రోడ్డులో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్, మాజీ వార్డు కౌన్సిలర్ డోలి లింగుబాబు పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో పిచ్చిమొక్కల తొలగింపు

మునిసిపల్ 12వ వార్డు పరిధిలోని టీచర్స్ కాలనీ చిల్డ్రన్స్ పార్కు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, సర్కార్ తుమ్మలను తొలగించారు. రోడ్డు వెంట పిచ్చిమొక్కలు, సర్కార్ తుమ్మలు పెరిగిన విషయాన్ని కాలనీ వాసులు స్థానిక వార్డు కౌన్సిలర్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన తక్షణమే జేసీబీ సాయంతో వాటిని తొలగించారు. కార్యక్రమంలో టీచర్స్ కాలనీ వాసులు రాచకొండ ఉపేందర్, సజ్జనం విద్యాసాగర్, గోనె కార్తీక్, గంధసిరి మురళి పాల్గొన్నారు.

టెస్కాబ్ చైర్మన్‌గా మార్నేని

» హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో ఏకగ్రీవ ఎన్నిక

» ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధికి తొలిసారి దక్కిన పదవి

» సీఎం, పలువురు మంత్రులను కలిసిన మార్నేని



టెస్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మార్నేని రవీందర్ రావును సత్కరిస్తున్న పలు డీసీసీబీల చైర్మన్లు

హనుమకొండ సిటీ, జూన్ 10 : తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) చైర్మన్‌గా ఉమ్మడి వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు నియమితులవగా.. వైస్ చైర్మన్‌గా హైదరాబాద్ డీసీసీ బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తెయ్య ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ అబిడ్స్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో సీసీ అండ్ ఆర్‌సీఎస్ కమిషనర్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఆధ్వర్యంలో ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగా ముగిసింది. ఎన్నిక పూర్తయిన తరువాత ఐఏఎస్ అధికారి, రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ హరిత నుంచి రవీందర్‌రావు నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్ ఉమ్మడి జిల్లా చరిత్రలోనే ఇక్కడి డీసీసీ బ్యాంక్ చైర్మన్ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కావడం ఇదే తొలిసారి. మార్నేని ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే రవీందర్‌రావు అనుచరులు, వర్ధన్నపేట నియోజకవర్గంలో సంబురాలు నెలకొన్నాయి.

కొండూరు రవీందర్‌రావు రాజీనామాతో ఏర్పడిన ఖాళీ

బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో రాష్ట్రంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఒకటి టెస్కాబ్ చైర్మన్ పోస్టు. రాష్ట్రంలో మొత్తం 9 డీసీసీ బ్యాంకులున్నాయి. చైర్మన్లుగా ఉన్న వారిలో ఏడుగురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. టెస్కాబ్ చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుతో పాటు వైస్ చైర్మన్‌గా ఉన్న నల్గొండ డీసీసీ బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడలేదు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతో చైర్మన్‌గా ఉన్న కొండూరు రవీందర్‌రావుపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం కాగా.. పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆయన స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేయగా, ఆయనతో పాటు వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి కూడా రాజీనామా చేశారు. ఈ క్రమంలో టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ పోస్టులకు ఎన్నిక అనివార్యమైంది. అయితే చైర్మన్ రవీందర్‌రావుపై సోమవారం అవిశ్వాస తీర్మానం జరగాల్సి ఉండగా అంతకుముందే రవీందర్‌రావు రాజీనామా చేయడంతో సభ్యులు ఈ సమావేశంలో మార్నేని రవీందర్‌రావును చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియకు గత చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, వైస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి గైర్హాజరయ్యారు. ఇక వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేనితో పాటు మిగిలిన ఆరు చైర్మన్లు హాజరై.. వారంతా మార్నేనికి మద్దతు తెలపడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. అయితే అంతకుముందు పలువురు డీసీసీబీ చైర్మన్లు ఈ చైర్మన్ పదవి కోసం పావులు కదిపారు. కానీ, చివరకు మార్నేని రవీందర్‌రావును చైర్మన్ పదవి వరించింది.

ఉమ్మడి జిల్లా నుంచి తొలి ప్రజాప్రతినిధి

వరంగల్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా గతంలో బాధ్యతలు చేపట్టిన వారిలో ఎవరూ టెస్కాబ్ చైర్మన్‌గా నియమితులు కాలేదని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. మార్నేని చైర్మన్‌గా నియమితులవడంతో జిల్లా నుంచి ఈ చైర్మన్ పదవిని పొందిన తొలి ప్రజాప్రతినిధిగా మార్నేని గుర్తింపు పొందారు. మార్నేని నియామకంతో వర్ధన్నపేట నియోజకవర్గం, ఆయన వర్గీయుల్లో ముఖ్యంగా ఆయన స్వగ్రామం ఐనవోలులో సంబురాలు చోటు చేసుకున్నాయి.

బయోడేటా :

పేరు	:	మార్నేని రవీందర్‌రావు
జన్మస్థలం	:	ఐనవోలు (వర్ధన్నపేట)
విద్యార్హతలు	:	బీ.ఏ.,
తండ్రి	:	మార్నేని మాధవరావు (స్వాతంత్ర్య సమరయోధుడు)
తల్లి	:	ప్రమీల
భార్య	:	మధుమతి (ఐనవోలు ఎంపీపీ)
కూతురు	:	రిషిత

రాజకీయ నేపథ్యం : 1983 నుంచి టీడీపీలో ఉంటూ అనేక పదవుల నిర్వహణ. 1987లో ఐనవోలు సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు

- 1996 నుంచి 2004 వరకు ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా వ్యవహరించారు.
- 2006లో వర్ధన్నపేట జడ్పీటీసీగా ఎన్నిక. జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతల నిర్వహణ. 2009లో బీఆర్ఎస్‌లో చేరిక.
- వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 2020 ఫిబ్రవరి 29 బాధ్యతలు చేపట్టారు.

పెద్దచెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

కూలిన రాతి గోడ

వరద పెరిగితే కట్ట కొట్టుకుపోయే ప్రమాదం


వేలుబెల్లిలో కూలిన పెద్ద చెరువు కట్ట రాతి గోడ

కొత్తగూడ, జూన్ 10 : కాకతీయుల కాలం నాటి పెద్ద చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉంది. చెరువు కట్టకు రక్షణగా ఉన్న రాతి గోడ కూలిపోయింది. శిథిలావస్థలో చెరువు తూము ఉంది. మండలంలోని వేలుబెల్లి గ్రామంలో నాడు కాకతీయులు పాలించే కాలంలో పెద్ద చెరువు తవ్వించారు. సుమారు 30 సంవత్సరాల క్రితం చెరువు కట్టకు బుంగలు పడి నీరు వృథాగా పోతుండగా రైతులు బుంగలు పూడ్చివేసి కట్టకు రక్షణగా రాతి గోడ నిర్మించారు. కాని, నేడు ఆ రాతి గోడ కూలిపోయింది. వర్షాలకు వచ్చిన వరద నీరుతో చెరువు నిండితే కట్టకు బుంగలు పడే ప్రమాదం ఉందని, బుంగలు పడితే చెరువు కట్ట కొట్టుకుపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కట్ట తెగితే నీరు వృథాగా పోయి పంటలకు నీరు లేక తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. చెరువుకు ఉన్న తూము సైతం శిథిలావస్థకు చేరుకుందని, కాలువలు పూడుకు పోయాయని రైతులు ఆయోమయానికి గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే చెరువు కట్టకు, తూములకు మరమ్మత్తు పనులు చేపట్టాలని సర్పంచ్ వజ్జ వెంకటలక్ష్మి సురేందర్, రైతులు కోరుతున్నారు. పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉందని గత సవంత్సరం మే నెలలో 'పెద్ద చెరువుకు పెద్ద గండం' అనే కథనంను ప్రచురించాము. అయిన నాటి నుంచి నేటి వరకు చెరువు కట్టకు, తూముకు మరమ్మత్తులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కొట్టుకుపోయిన తర్వాతే అధికారులు స్పందిస్తారేమోనని రైతులు విమర్శిస్తున్నారు.

జూలై 1 నుంచి పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 : కేయూ పరిధిలో పీజీ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు జూలై 1 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు జూలై 1 నుంచి 12 వరకు కొనసాగున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై చర్యలు చేపట్టాలి

టెలీకాన్ఫరెన్స్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూన్ 10 : విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి క్షేత్ర స్థాయిలో భద్రత చర్యలు చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరు ణ్‌రెడ్డి అన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల 16 సర్కిళ్ల టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లతో సోమవారం సీఎండీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. తరుచుగా జరిగే విద్యుత్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని, భద్రతపై నిర్ల క్ష్యం, అవగాహన లోపంతో నాసిరకం విద్యుత్ పరికరాల వినియోగంతో వినియోగదారులు తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాదాల నివారణకు సర్కిళ్ల వారీగా టెక్నికల్ డివిజన్ ఇంజనీర్లు నోడల్ సేఫ్టీ అధికా రులుగా వ్యవహరించి వినియోగదారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు, రైతులకు, టీజీ ఎన్పీడీసీఎల్ సిబ్బందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని, భద్రత ప్రమాణాలపై అవగాహన కల్పించి వాటిని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకో వాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు కిందిస్థాయి సిబ్బంది నుంచి సీనియర్ అధికారుల వరకు అందరి కృషి అవసరమన్నారు. ఎన్పీడీసీఎల్‌ను జీరో విద్యుత్ ప్రమాదాల సంస్థ తీర్చిదిద్దేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టామని, అందుకు ప్రతీ ఒక్క సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలన్నారు.

గన్నీబ్యాగుల ధర రూ.60కు పెంచాలి

మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్‌కు రైతు సంఘం వినతి



మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతి ప్రతం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు

వరంగల్ వ్యవసాయం, జూన్ 10: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో రైతుల గన్నీబ్యాగులకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.30 నుంచి రూ.60లకు పెంచాలని తెలం గాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు సోమవారం హైదరాబా ద్‌లో మార్కెటింగ్‌శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయికి వినతిపత్రం అందజేశారు. చందర్‌రావు పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏడేళ్లగా గన్నీబ్యాగుల ధరలు పెంచలే దని, ప్రస్తుతం చెల్లించే రూ.30 సైతం నిబంధనల మేరకు వ్యాపారులు చెల్లించడం లేదని పేర్కొన్నారు. రైతులకు వ్యాపారులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు అదే రైతులు చెల్లించే దడువాయి, హమాలీ, గుల్లవాల, చాటవాల చార్జీ లను మాత్రం క్రమం తప్పకుండా రెండేళ్లకు ఒకసారి పెంచుతూ పోతున్నారని వివ రించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కూస సంపత్‌కుమార్, బల్లు కురి నర్సయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



నెక్రూరా సెంటర్, జూన్ 10 : మహబూ బాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ గుర్తుతె లియని మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ ఇన్‌చార్జ్ ఎస్సై భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో కిలోమీటరు రాయి 435/13 వద్ద సుమారు 45ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని మహిళ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని పేర్కొన్నారు. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేష న్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామ న్నారు. ఆమె మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు చెప్పారు.

విత్తన ఎంపికే కీలకం



షాపుల్లో సిద్ధంగా ఉంచిన పురుగు మందులు

- ప్రకటనలు చూసి మోసపోవద్దు
- రైతులు అప్రమత్తంగా ఉండాలి
- నాణ్యమైన విత్తనాలనే కొనాలి
- రశీదులు భద్రపరుచుకోవాలి
- నేల స్వభావం మేరకు ఎరువులు వాడాలి
- సూచిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బచ్చన్నపేట/నర్మెట, జూన్ 10: రైతులు వానాకాలం సాగును ప్రారం భించారు. రోహిణి కార్తెలో కొంత మంది నార్లు పోయగా, మరికొంత మం ది వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా వరితో పాటు పత్తి, మొక్కజొన్న, కంది పంటలు పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశం ఉంది. వర్షాలు సైతం అనుకూలంగా కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ముందస్తు సంకేతాలు ఇస్తుండటంతో సాగుకు అనుకూలంగా ఉన్న భూములను వదిలి పెట్టకూడదని రైతులు బావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో విత్తన, పురుగు మందుల కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి విస్తృత ప్రచారం చేస్తూ రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గ్రామాల్లో టెంట్లు వేసి రైతులను సమీకరించి భోజనాలు ఏర్పాటు చేసి మరీ ప్రచారం చేస్తున్నాయి. తమ కంపెనీ విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయని, పంటచేనుకు ఎలాంటి తెగుళ్లు రావని ఊదరగొడుతున్నాయి. అధికారులు ఎంత తనిఖీలు చేసినా మార్కెట్లోకి నకిలీ విత్తనాలు, పురుగు మందులు వస్తూనే ఉన్నాయి. అయితే పంట దిగుబడి అధికంగా రావాలంటే నాణ్యమైన విత్తనాలు అవసరం. ఈ విషయంలో రైతులు అప్రమత్తంగా లేకపోతే శ్రమ, పెట్టుబడి కోల్పోక తప్పదు.

పురుగు మందుల కొనుగోళ్లలో జాగ్రత్తలు..

పురుగు మందుల మోతాదు ఎక్కువైతే నష్టపోయేది రైతే. వ్యవశాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని వాడాలని అధికారులు సూచిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై వాటి స్థాయిని తెలిపే విధంగా డైమాండ్ ఆకారంలో ఎరుపు, నీలం, ఆకుపచ్చ రంగులు ముద్రించి ఉంటాయి. వాటి గురించి సమగ్రంగా తెలుసుకుని వాడటం మంచిదని అంటున్నారు. వివిధ రకాల పురుగు మందుల డబ్బాల్లో మందు మిగిలితే అన్నింటిని కలిపి కొట్టడం ప్రమాదకరం. ఇలా చేసి అనేక మంది తమ పంటలను కోల్పోయిన వారు ఉన్నారు. కొనుగోలు చేసే సమయంలో రశీదు తీసుకోవటంతో పాటు, డీలర్ రిజిస్టర్ బుక్‌లో సంతకం చేస్తే, నకిలీ పురుగుమందుల వల్ల నష్టపోతే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఎరువుల విషయంలోనూ ఇలాంటి జాగ్రత్తలే తీసుకోవాలని, అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చాలని సూచిస్తున్నారు.

విత్తన కొనుగోళ్లపై నిర్లక్ష్యం తగదు..

నాసిరకం విత్తనాలు వాడితే విరివిగా తెగుళ్లు సోకుతాయని, పంట దిగుబడి తక్కువగా వస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలంటున్నారు. విడి విత్తనాల జోలికి వెళ్లవద్దంటున్నారు. తీసుకునే బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రకం పేరు, బ్యాచ్ నంబరు గడువు తేదీలు పరిశీలించి తీసుకోవాలంటున్నారు.

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలి..

నేల స్వభావాన్ని బట్టి పంట ఎదుగుదల, చీడపీడల ఉధృతి ఉంటుంది. అందువల్ల భూమి పోషక విలువలను బట్టి ఎరువులు, పురుగు మందులు వాడడం ఉత్తమం. ఒకరిని చూసి మరొకరు ఒకే రకం పంటలు, విత్తనాలు వేయకుండా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు వాడడం మంచిదని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.



నారు పోయడానికి సిద్ధం చేసిన పొలం



డ్రిప్ ఆధారంగా సాగు చేసిన పత్తి

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి...

- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖాధికారి



విత్తనాల కొనుగోలులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. లూజు విత్తనాలను కొనుగోలు చేయవద్దు. నకిలీ విత్తనాలు అని అనుమానం వస్తే వెంటనే అధికారులకు తెలియజేయాలి. సేంద్రియ పద్ధతుల ద్వారా సాగు చేయాలి. మార్కెట్‌లోకి నకిలి విత్తనాలు, పురుగు మందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగే విధంగా ప్రణాళికలు రూపొందించుకున్నాం. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై రైతులకు అనుమానం వస్తే వెంటనే ఏఈవోలకు, ఏవోకు, అవసరమైతే నాకు సమాచారం అందించాలి. రైతాంగానికి అన్యాయం జరగకుండా ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తాం.

చేతన ఫౌండేషన్‌కు 'ఆటా' అవార్డు



అమెరికాలోని అట్లాంటా నగరంలో అవార్డు అందుకుంటున్న వెనిగళ్ల రవికుమార్

భారత్ సహా పలు దేశాల్లో సేవా కార్యక్రమాలు

బయ్యారం, జూన్ 10 : భారత్, అమెరికా సహా ఏడు దేశాల్లో వివిధ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు విశ్వనగరం వేదికగా అరుదైన అవార్డు లభించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో చేతన గ్లోబల్ ఫౌండేషన్‌కు అమెరికన్ తెలుగు అసోసియేషన్(ఆటా) అవార్డు లభించడంపై స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. బయ్యారం మండలం గంధం పల్లి గ్రామానికి చెందిన వెనిగళ్ల జగ్గాప్రసాద్‌రావు-సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు రవికుమార్ ఉన్నత విద్యనభ్యసించి అమెరి కాలో స్థిరపడ్డాడు. 2016లో రవికుమార్ భార్య రేణుకతో పాటు పలు వురు ఎన్ఆర్ఐల సహకారంతో చేతన గ్లోబల్ ఫౌండేషన్ స్థాపించి వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అంచెలంచెలుగా ఎదు గుతూ భారత్, అమెరికాతో సహ 7 దేశాల్లో చేతన గ్లోబల్ ఫౌండేష న్ ద్వారా నిర్వాహకులు సేవా కార్యక్రమాలను విస్తరించారు. పేద ప్రజలు, విద్యార్థులు, వికలాంగులు, వృద్ధులకు తమవంతుగా సహా యపడేందుకు నిర్వాహకులు ఈ 8ఏళ్ల కాలంలో కోట్ల రూపాయలు వెచ్చించి పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఈ క్రమంలోనే చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు నిర్విరా మంగా 7 దేశాల్లో చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన ఆట సంస్థ అవార్డుతో సత్కరించింది. అమెరికాలోని అట్లాంటా నగ రంలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన 18వ ఆట (అమెరికా తెలుగు అసోసియేషన్) మహాసభల సందర్భంగా ఆదివారం ఆట అధ్యక్షుడు బొమ్మినేని మధు చేతుల మీదుగా చేతన గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థా పకులు వెనిగళ్ల రవికుమార్ ఆట అవార్డు అందుకున్నారు. కాగా, విద్య వైద్యం, మహిళా సాధికారిక, పర్యావరణంతో పాటు వివిధ రంగాల్లో తాము చేపడుతున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించినట్లు చేతన గ్లోబల్ ఫౌండేషన్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ గుర్తింపుతో తమపై బాధ్యత మరింత పెరిగింద న్నారు. మున్ముందు మరిన్ని సేవా కార్యాక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా పుట్టిన గడ్డ రుణం కొంతైనా తీర్చుకునే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అంతేకాక చేతన గ్లోబల్ ఫౌండేషన్‌లో అంకితభావంతో పనిచేస్తూ తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికి ఈ అవార్డు అంకితం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోటవేటర్లో పడి బాలుడి మృతి

తండ్రి దుక్కి దున్నుతుడగా సరదగా ట్రాక్టర్ ఇంజన్ ఎక్కిన బాలుడు

జారి పడటంతో ముక్కలైన శరీర భాగాలు

వరంగల్ జిల్లా లైన్‌తండాలో విషాదం



గుగులోతు బాలు (ఫైల్)



మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

నల్లబెల్లి, జూన్ 10 : ట్రాక్టర్ రోటవేట ర్‌తో తండ్రి దుక్కి దున్నుతుండగా.. సర దాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి ఎక్కిన కుమా రుడు ప్రమాదవశాత్తు రోటవేటర్లో పడి మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం లైన్‌తండాలో సోమ వారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం... లైన్‌తండాకు చెందిన గుగులోతు మశోద, రాజులు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. సోమ వారం రాజు ట్రాక్టర్ ఇంజన్‌కు రోటవేట ర్‌ను తగిలించుకొని తన భూమిలో దుక్కి దున్నుతున్నాడు. మధ్యాహ్నం చిన్న కుమారుడు గుగులోతు బాలు(9) రాగా, సరదాగా ట్రాక్టర్ ఇంజన్ పైకి బాలు ఎక్కాడు. దుక్కి దున్నతున్న సమయంలో ట్రాక్టర్ కుదుపులకు బాలు రోటవేటర్లో పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్‌ను ఆపినా, అప్పటికే శరీరం రెండు ముక్క లైంది. ఘటన స్థలికి చేరుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిం చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బాలుడి తల్లి మశోద ఫిర్యాదు మేరకు ఎస్సై రామారావు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 10 :కేయూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులతో కలిసి కేయూ పరిపాలన భవనాన్ని ముట్ట డించారు. పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం లేదని ఆరోపిం చా రు. సమస్యలపై విన్నివించినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిగ, పాలు, టీ సరిగా ఇవ్వడం లేదన్నారు. విద్యార్థులు మెస్ బిల్లులు నెలనె లా కడుతున్నప్పటికీ అధికారులు నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమవుతున్నారన్నారు. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థులు శ్రీనాథ్, పృథ్వీ, ప్రవళిక, అనూష, శిరీష, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కేయూ పరిపాలన భవనంలో బైఠాయించి ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

'ఆయుర్వేదం'లో టెలిమెడిసిన్ సేవలు

వరంగల్‌లోని ప్రభుత్వ బోధనాసుపత్రి నుంచి అందుబాటులోకి

0870-2933553కు కాల్ చేస్తే వైద్య సలహాలు

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి



టెలిమెడిసిన్ కేంద్రంలో రోగికి ఫోన్‌లో వైద్య చికిత్స సలహాలు ఇస్తున్న వైద్యుడు

గిర్మాజీపేట, జూన్ 10 : రోగుల సౌలభ్యం కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి ఇటీవల టెలిమెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పక్ష వాతం, అర్షమొలలు, వెరికోస్ వెయిన్స్, మోకాలు నొప్పులు, దీర్ఘకాలిక, మొండి రోగాలకు వైద్య చికిత్స అందిస్తోంది. మెరుగైన సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. కరోనా సమయంలో ఆస్పత్రులకు రాలేని రోగులకు ఫోన్ ద్వారా వైద్య సలహాలు అందించారు. ఇదే తర హాలు ఇకనుంచి నిత్యం ఫోన్‌లోనే సలహాలు, సూచ నలు అందించేందుకు ఇటీవల ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తెచ్చింది.

ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సేవలు..

ఆస్పత్రిలో టెలిమెడిసిన్ కోసం ప్రత్యేక చాంబర్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం, సెలవు రోజులు మినహా ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలిమెడిసిన్ అందుబాటులో ఉంటుంది ఆయుర్వేద వైద్య విభాగాలైన శల్య, శాలక్య, ప్రసూతి, స్త్రీరోగ, స్వస్థవృత్య, పంచకర్మ, కాయ చికిత్స లలో నిష్ణాతులైన వైద్యులు, వైద్య అధ్యాపకులు ప్రతి రోజు రోగులకు అందుబాటులో ఉంటూ టెలిమెడిసిన్ ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. రోగి 0870- 2933553 టెలిమెడిసిన్ సెంటర్‌కు కాల్ చేయ గానే ఆ రోజు సెంటర్‌లో డ్యూటీలో ఉన్న వైద్యుడు రిజిస్టర్‌లో రోగి పేరు, ఫోన్ నెంబర్ నమోదు చేసుకుని రోగికి వైద్య చికిత్స సలహాలు ఇస్తారు. అందుబాటులో ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరి ఉంటే అక్కడికి వెళ్లి ఉచితంగా మందులు తీసుకునే వెసులుబాటు కల్పి స్తారు. లేనిపక్షంలో ప్రయివేట్‌గా కొనుగోలు చేసుకో వచ్చు.

అన్ని రోగాలకూ సేవలు..

గ్యాస్ట్రిక్ ట్రబుల్, కీళ్ల నొప్పులు, తలనొప్పి, మైగ్రేన్, సైనసైటిస్, అర్షమొలలు, దీర్ఘకాలీక నడుము నొప్పు లతో పాటుగా ఇన్‌ఫర్టిలిటీ, నిద్రలేమి సమస్యలపై టెలి మెడిసిన్‌కు కాల్ వస్తున్నాయని వైద్యులు చెబుతు న్నారు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, వృత్తి, కుటుంబపరమైన మానసిక ఒత్తిడి, మారిన జీవన శైలి, రోజువారి శారీరక వ్యాయామం లేకపోవడం, ఫాస్ట్‌ఫుడ్స్ బ్రేవరేజ్ ఐటెమ్స్ తీసుకుంటున్న కారణాల తోనే అనారోగ్యా సమస్యలకు గురవుతున్నట్లుగా రోగుల కాల్స్‌తో తెలుస్తోందని వైద్యులు చెబుతున్నారు. వరం గల్ మహానగరంతో పాటుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి నిత్యం 10 నుంచి 20 కాల్ వస్తున్నాయని పేర్కొంటున్నారు.

నిష్ణాతులైన వైద్యులు..

వరంగల్ రైల్వే, ఆర్టీసీట బస్‌స్టేషన్‌లకు సమీపంలో ఉన్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రి నిత్యం 300 మంది అవుట్‌పేషంట్, వంద మంది ఇన్ పేషంట్‌లతో వైద్య సేవలు అందిస్తోంది. పక్షవాతం, కీళ్లనొప్పులు, మోకాలు నొప్పులు, వెరికొస్ వెయిన్స్ అర్ష మొలలు, ఫిస్టిలా, వెన్నునొప్పులు, చెవి, ముక్కు, కన్ను, మధుమేహం, రక్తపోటు, స్త్రీ సంబంధిత, శిశు సంబం ధిత రోగాలకు నిష్ణాతులైన వైద్యులు ఉచితంగా మెరు గైన వైద్య చికిత్సలు చేస్తుండటంతో ఆస్పత్రి నిత్యం రోగులతో కిటకిటలాడుతోంది. వరంగల్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కూడా రోగులు వస్తున్నారు.

టెలిమెడిసిన్‌ను వినియోగించుకోవాలి

డాక్టర్ పద్మావతి, సూపరింటెండెంట్



ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రాలేని రోగుల కోసం టెలిమెడిసిన్ సేవలు అందిస్తున్నాం. రోగి అనారోగ్య పరిస్థితిని 0870-2933553 కాల్ చేసి చెబితే వైద్యులు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తారు. సమీప ప్రభుత్వ ఆయుర్వేద డిస్పెన్సరీకి రిఫర్ చేస్తూ ఉచితంగా మందులు ఇప్పిస్తున్నాం. ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించాల్సిన పరిస్థితి ఉంటే వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నాం. ఈ అవకాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ఉపాధ్యాయుడి ఫోన్ హ్యాక్

కొత్తగూడ, జూన్ 10 : మండలంలోని పొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నెల్లుట్ల భాస్కర్ ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఫోన్‌ను హ్యాక్ చేసిన నేరగాళ్లు వాట్సాప్‌లో ఇతరులతో చాట్ చేస్తూ డబ్బులు పంపించాలని మెస్సేజ్‌లు పెడుతున్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ తన పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే పంపించవద్దని తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తిచేయాలి

నెల్లికుదురు, జూన్ 10 : అమ్మ ఆదర్శ పాఠశాల పనులను వేగవంతంగా పూర్తిచేయాలని ఎంఈవో గుగులోతు రాము తెలిపారు. నెల్లికుదురులోని టెంపుల్ కాలనీ పాఠశాలలో జరుగుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున అప్పటికి వరకు మిగతా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రవీందర్‌రావు



మహబూబాబాద్ టౌన్, జూన్ 10 : మెదక్ జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఎర్రవల్లిలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ విజయపథాన నడుస్తుందని, పార్టీ బలోపేతానికి కృషి చేయా లని కేసీఆర్ సూచించినట్లు ఎమ్మెల్సీ రవీందర్ రావు తెలిపారు.

పౌరహక్కుల యోధుడు బాలగోపాల్ జయంతి



బాలగోపాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 10: మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో హక్కుల యోధుడు, ప్రొఫెసర్ డాక్టర్ కె.బాలగోపాల్ జయంతిని సోమవారం నిర్వహించారు. అయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ మాట్లాడుతూ.... సమాజంలో ఎక్కడ ప్రజల హక్కులకు భంగం కలిగితే అక్కడ బాధితులకు బాసటగా నిలిచిన యోధుడు బాలగోపాల్ అని కొనియాడారు. దేశంలో పౌరహక్కుల ఉద్యమంలో ఆయన పాత్ర కీలకమని చెప్పారు. ప్రముఖ గణిత మేధావిగా, హైకోర్టు న్యాయవాదిగా, పీడిత ప్రజల గొంతుకగా సాధారణ జీవితం గడుపుతూ పౌరహక్కుల కోసం ఉద్యమించారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మద్దెర్ల రమేష్, డోలి లింగుబాబు, డి.రాంమూర్తి, రవి, శంకర్, శ్రీనివాసచారి, పాషా, ఉప్పలయ్య, ప్రసాద్, కృష్ణారావు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మెడికల్ షాపు దగ్ధం

కేసముద్రం, జూన్ 10 : కేసముద్రం స్టేషన్ మార్కెట్ రోడ్డులో సాయిరాం మెడికల్ షాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో షాపులో నుంచి దట్టమైన పొగలు వస్తుండడంతో మార్కెట్ సిబ్బంది గమనించి యజమానికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు ఎగిసిపడుతుండడంతో మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో మెడికల్ షాపు, ఆర్ఎంపీ వైద్యుడి ఫర్నీచర్, మందులు, ఇతర సామగ్రి కాలిపోయింది... కాలి బూడిదైంది... వెరసి రూ.15 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఆర్ఐ బాబు తెలిపారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మెడికల్ షాపు నిర్వాహకుడు పి.నరేష్‌కు ఈ ప్రమాదంతో ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతగిలినట్లయింది. కాగా, ప్రభుత్వం బాధితున్ని ఆదుకోవాలని పలువురు కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య





జమాండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న జడ్పీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, గూడూరులో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 10 : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు సమ్మెట వెంకటేశ్వర్లు, గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా చార్జీలు, దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక విద్య అందించడంతో పాటు మధ్యాహ్నభోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎస్సెస్సీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు డి.ఉమ, ఆర్.సునీత ఉపాధ్యాయులు ప్రభావతిదేవి, మహేశ్వర్, సరిత, బ్రహ్మం, మధుసూదనాచారి, శ్యాంప్రసాద్, గ్రామ సమైఖ్య ఆర్పీలు బొద్దుల వెంకన్న, పిట్టల తిరుపతమ్మ, అనిత, వెంకటమ్మ, కల్పన, భారతమ్మ, వసంత, సునీత పాల్గొన్నారు.

● మహబూబాబాద్ మండలంలోని అమనగల్‌లో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో బడిబాటలో భాగంగా ర్యాలీ చేపట్టి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ సందర్భంగా గుండాలగడ్డ తండా మాజీ సర్పంచ్ హరినాయక్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించారని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి బలోపేతానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సత్యశంకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు బలాష్టి రమేష్, బాలాజీ, యుగందర్, ఉస్మాన్, హైమ, అరుణ, షమీం తదితరులు పాల్గొన్నారు.

● గూడూరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యనందించడం జరుగుతుందని గూడూరు బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుజాత, సదాశివ అన్నారు. గూడూరులో బడిబాటలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్నభోజనం అందించనున్నట్లు పేర్కొన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీటీసీ కత్తి స్వామి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థిక సాయం

గార్ల, జూన్ 10: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మల్లికంటి నర్సయ్య ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో 5 నెలల క్రితం మృతి చెందారు. ఆ కుటుంబానికి పాఠశాల యాజమాన్యం వడ్లముడి దుర్గాప్రసాద్, బీరవెల్లి సంజీవరెడ్డి, తోటి ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్ గంగావత్ రాంసింగ్‌నాయక్, మార్బుల్ కంపెనీ యాజమాని షేక్.ఖాదర్‌బాబాలు రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. సదరు నగదును ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబసభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పసుపులేటి రమేష్, మునీర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు: ఆలేరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా బానోత్ కిషన్ విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన కుటుంబసభ్యులకు పేటా టీఎస్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ. 55 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కిషన్ కుటుంబ సభ్యులను ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు జి నాగయ్య, జ్యోతి, హెచ్ ఐలయ్య, వెంకటయ్య, విజయ్‌చందర్, కొప్పుల శంకర్, కంచర్ల ప్రభాకర్, సునిల్ శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



కిషన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వ్యవసాయాధికారిగా మురళీమోహన్

తొర్రూరు, జూన్ 10 : తొర్రూరు, పెద్దవంగర మండలాల వ్యవసాయాధికారిగా ఎ.మురళీమోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కుమార్ పచ్చిరొట్ట విత్తనాల విక్రయాల్లో అవినీతికి పాల్పడటంతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో డోర్నకల్ ఏవోగా విధులు నిర్వహిస్తున్న మురళీమోహన్ తొర్రూరు ఇన్‌చార్జ్ ఏవోగా బాధ్యతలు చేపట్టారు.

ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా మంజుఖాన్

దంతాలపల్లి : మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా మంజుఖాన్ సోమవారం విధుల్లో చేరారు. మంజుఖాన్ కురవి మండల ఏవోగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో ఇక్కడ పనిచేస్తున్న ఏవో సస్పెండ్ కావడంతో ఇన్‌చార్జ్ బాధ్యతను అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపు యజమానులతో సమావేశమయ్యారు. రైతులకు తప్పక రశీదులను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సందీప్, దీక్షిత్, శిరీష, షాపు నిర్వాహకులు రాజన్న, అశోక్, శ్రీను, ప్రశాంత్, వెంకటరెడ్డి, రవీందర్, రాజు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

నెహ్రూసెంటర్, జూన్ 10 : మహబూబాబాద్‌లోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలు, వార్డుల వారీగా కలియ తిరుగుతూ పర్యవేక్షించారు. వైద్యం ఎలా అందుతుందని రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించి ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. కిడ్నీ, డయాలసిస్ రోగుల కోసం అదనంగా మరో ఐదు మిషన్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రికి డయాలసిస్ యంత్రాలను మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే మురళీనాయక్‌ను వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.



ఆస్పత్రిలో ఎమ్మెల్యే మురళీనాయక్‌ను సన్మానిస్తున్న వైద్యులు

క్యాన్సర్‌తో 15 నెలల చిన్నారి మృతి



షబాన (ఫైల్)

గార్ల, జూన్ 10 : అభం.. శుభం తెలియని చిన్నారి క్యాన్సర్ బారినపడి సోమవారం మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం... గార్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ బజారుకు చెందిన షఫీ-రుబియా దంపతులకు ఇరువురు కుమార్తెలు సంతానం. భర్త షఫీ సౌదీలో పనిచేస్తూ నెలనెల ఇంటికి డబ్బులు పంపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వారి చిన్నకుమార్తె షబాన(15 నెలలు) 5 నెలల క్రితం క్యాన్సర్ బారిన పడింది. దీంతో తల్లి రుబియా హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తూ వచ్చింది. సోమవారం షబాన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. చిన్నారి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ ఇంజిన్ పైనుంచి పడి బాలుడి మృతి



మృతి చెందిన సతీష్

దంతాలపల్లి, జూన్ 10 : ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి పడి పదహారేళ్ల బాలుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని దొనకొండలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన నారాయణపు ఉప్పలయ్య-మంగమ్మ దంపతుల రెండవ కుమారుడు సతీష్ (16) తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్ దుక్కిని చదను చేస్తుండగా ట్రాక్టర్ ఇంజన్‌పై డ్రైవర్ పక్కనే ఉన్న సతీష్ ప్రమాదవశాత్తు కాలుజారి ఇంజన్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సతీష్ ఇటీవలే పదో తరగతి పాసయ్యాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

నల్లబెల్లం, గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు : సీఐ



సుందరయ్యనగర్‌లో బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

నెహ్రూసెంటర్, జూన్ 10 : ప్రభుత్వం నిషేధించిన నల్లబెల్లం, గుడుంబాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి అన్నారు. మహబూబాబాద్‌లోని సుందరయ్యనగర్ ఆర్టీసీ కాలనీలో గుడుంబా స్థావరాలపై సోమవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. గుడుంబా, నల్లబెల్లం విక్రయిస్తే ఎంతటి వారైనా ఊపేక్షించేది లేదని పేర్కొన్నారు. గుడుంబా, నల్లబెల్లం విక్రయించి కేసుల పాలు కావొద్దని హెచ్చరించారు. గుడుంబా, నల్లబెల్లం తరలింపుకు పాల్పడిన వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేస్తున్నామని, సెల్‌ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా నేరస్తుల కదలికలను గమనిస్తున్నట్లు చెప్పారు. అలాగే పీడీయాక్టు నమోదు చేస్తామని సీఐ జి. చిరంజీవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

▸▸ ఆలయ ట్రస్టు చైర్మన్ సనాతనాచారి



ఆలయంలో పూర్ణాహుతిలో పాల్గొన్న ట్రస్టు బాధ్యులు, భక్తులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 10: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ట్రస్టు చైర్మన్ పమ్మి సనాతనాచారి అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక దేవాలయంలో 40 రోజులుగా కొనసాగిన గాయత్రి హోమ పూజా కార్యక్రమాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకులు తాటిపాముల శివకృష్ణ మాచార్యుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మంత్రం జపిస్తే జీవితంలో సుఖసంతోషాలు పొందవచ్చన్నా రు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బాధ్యులు అనురాధ, తాడూరు మాధవాచారి-గీతాదేవి, ఎర్రోజులక్ష్మణాచారి రమాదేవి, వలబోజు సోమ య్య రాజమౌళి, మణిభాగ్యలక్ష్మి, రత్నమాచారి, మోహన్‌రావు, హరి, సతీష్, భక్తులు పాల్గొన్నారు.

'ఎంపీలు గెలిచినందుకు తలనీలాలు సమర్పిస్తా'

ఇనుగుర్తి, జూన్ 10 : పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాంనాయక్, వరంగల్ ఎంపీగా కడియం కావ్య గెలుపొందినందుకు తాను తలనీలాలు సమర్పిస్తానని ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుజ్జనూరి బాబురావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోలేమన్నారు. తెలంగాణలో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం హర్షించదగ్గ విషయమన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఎంపీలుగా గెలుపొందిన సందర్భంగా ఇనుగుర్తిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట త్వరలోనే తన తలనీలాలు సమర్పిస్తానని చెప్పారు.

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర : ఎన్డీ

బయ్యారం, జూన్ 10 : ఉపాధి హామీ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యపరిచేందుకు కుట్రకు పాల్పడుతుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజనల్ కార్యదర్శి మోకాళ్ల మురళీకృష్ణ ఆరోపించారు. ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బయ్యారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఉపాధి హామీ పథకం కింద లక్షలాది మంది ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు. నిధుల లేమితో సరిపడా పనులు కేటాయించకపోవడంతో కూలీల జీవన పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పౌర సమాజ సంఘాలు విడుదల చేసిన నివేదికల ప్రకారం గత రెండేళ్ల కాలంలో పథకం కింద 8 కోట్ల మందిని తొలిగించడాన్ని చూస్తే పథకాన్ని నిర్వీర్యపరచడానికి కేంద్రం ఎలాంటి కుట్రలకు పాల్పడుతుందో అర్థం అవుతుందన్నారు.

కూలీల పెండింగ్ సమస్యలు పరిష్కరించడంతో పాటు పథకాన్ని పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కూలీలు భిక్షం, నాగేశ్వరరావు, సంగన్న, మురళి, మంగీలాల్, ఐలయ్య, విశ్వనాథం, లింగమల్లు, శేషు, హన్మ, రాకేష్, సమ్మక్క, కలమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను కలిసిన మహేష్

దంతాలపల్లి, జూన్ 10 : మండల కేంద్రానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్ సోమవారం కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ తెలంగాణలో పుంజుకుందన్నారు. కేంద్ర మంత్రుల ఆధ్వర్యంలో రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు.


హైదరాబాద్ తరలిన మహిళా సంఘం ప్రతినిధులు

పెద్దవంగర, జూన్ 10 : నాబార్డు సహకారంతో లక్ష్యం సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీ కోసం వినియోగిస్తున్న సాంకేతిక టెక్నాలజీ, తయారీ విధానం పరిశీలనకు మహిళా సంఘం ప్రతినిధులు తరలి వెళ్లారు. సోమవారం ఈ సందర్భంగా లక్ష్యం సేవా సంస్థ సీఈవో తల్లూరి లత మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున సంఘాలుగా ఏర్పడి చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించాలన్నారు. నాబార్డు ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శంకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలకు అధికారులే బాధ్యత వహించాలి

కురవి, జూన్ 10 : వ్యవసాయ భూముల్లో విద్యుత్ ప్రమాదాలకు విద్యుత్ అధికారులే బాధ్యత వహించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు నల్లపు సుధాకర్, జిల్లా నాయకుడు మలేడి కోటయ్య అన్నారు. కురవి మండలం కందికొండ, బలపాల గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినప్పటికి పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆతీగలను తాకి పదుల సంఖ్యలో పశువులు మృత్యువాత పడుతున్నాయని, ఈ మరణాలకు విద్యుత్ అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన పశువులన్నింటికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పిట్టల మోహన్‌రావు, దర్గయ్య రావూరి రమేష్, వెంకన్న, వీరన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



సురేష్ (ఫైల్)

పెద్దవంగర, జూన్ 10 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పోచంపల్లిలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్సై బానోతు మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం పెద్దవంగర మండలంలోని అవుతాపురం గ్రామ శివారులో పాలకుర్తి- నాంచారిమడూర్ ప్రధాన రహదారిపై ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన ధార కిషోర్ తన కారులో కుటుంబసభ్యులతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లి తిరిగి జనగామ నుంచి వయా పాలకుర్తి మీదగా ఖమ్మం వెళ్తున్న క్రమంలో అవుతాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న అవుతాపురం గ్రామానికి చెందిన గద్దల అశోక్(37), అతని బంధువులైన పోచంపల్లి గ్రామానికి చెందిన కుందురు రవి(32), కుందురు సురేష్(30)ల మీదకు దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుందురు సురేష్‌కు తీవ్రగాయాలు కావడంతో హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి కుందురు సోమేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

విత్తన విక్రయ షాపుల్లో తనిఖీలు

బయ్యారం, జూన్ 10: మండలంలోని పలు విత్తన విక్రయ కేంద్రాలు, పురుగు మందుల షాపుల్లో మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. బయ్యారంలోని రైతుమిత్ర విత్తన షాపు, రామచంద్రాపురంలోని సనా ట్రేడర్స్, శ్రీరామ ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫార్మా రిజిస్టర్, ఇన్వాయిస్ బిల్స్, స్టాక్ బోర్డుతో పాటు తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన జరిపారు. సీడ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయనే దానిపై డీలర్లను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎస్సై ఉపేందర్, ఏవో రాంజీ నాయక్, ఏఈవోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4వేల పింఛన్ హామీని నెరవేర్చాలి

కేసముద్రం, జూన్ 10 : వృద్ధులకు, వితంతువులకు రూ.4వేల ఆసరా పింఛన్‌ను అమలు చేయాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంఆర్ఐ బాబుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.వెంకన్న, బి.రాజు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వేదిక

తొర్రూరు, జూన్ 10 : తొర్రూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం వేదిక ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల ఫోరం చైర్మన్ కె.ఎన్.గుట్ట సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. విద్యుత్ బిల్లుల్లో సమస్యలు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, నూతన సర్వీసుల విడుదల, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పులు తదితర సమస్యలపై వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు తొర్రూరు, చిన్నవంగర, పెద్దవంగర సబ్‌స్టేషన్ పరిధిలోని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువతి మృతి



అనిత (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జూన్ 10 : ఓ యువతి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. ఈ సంఘటన మహబూబాబాద్ మండలం సికింద్రాబాద్‌తండాలో సోమవారం చోటుచేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపిన ప్రకారం... సికింద్రాబాద్‌తండాకు చెందిన భూక్య హుస్సేన్-హక్రి దంపతులకు ముగ్గురు కుమార్తెలు సంతానం. వారు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్దకుమార్తె అనిత ఇంటర్ పూర్తిచేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పని చేస్తోంది. వ్యవసాయ క్షేత్రంలోని మిర్చి కట్టెను తొలగించేందుకు తల్లి హక్రి ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్లారు. ఈ క్రమంలో పెద్ద కుమార్తె భూక్య అనిత(19) మంచినీరు తీసుకువచ్చేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళి నీరు తొడుతున్న క్రమంలో కాలు జారి బావిలో పడి మృతి చెందింది. తల్లి హక్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

మానుకోటలో రామోజీరావుకు నివాళి



మహబూబాబాద్‌లో రామోజీరావు ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న పలు పత్రికల సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూన్ 10 : మహబూబాబాద్ పట్టణంలో పత్రికాధినేత రామోజీరావుకు న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ నివాళులర్పించింది. జిల్లా కేంద్రంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రామోజీరావు ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేసన్ జిల్లా అధ్యక్షుడు బిడుదుల గోపాల్ మాట్లాడుతూ... ఈనాడు పత్రికను స్థాపించిన రామోజీరావు అకుంఠిత దీక్షతో పనిచేసి మారుమూల గ్రామాలకు సైతం ప్రపంచ నలుమూలల వార్తలు చేరేలా కృషి చేశారని చెప్పారు. పత్రికా రంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బానోత్ శంకర్, రంగు సురేష్, ప్రధాన కార్యదర్శి నూకల శ్రీనివాస్, సత్యప్రసాద్, ఏజెంట్ ఆకర్స్ పేపర్ బాయ్స్, సర్క్యులేషన్ ఇన్‌చార్జీలు, అడ్వర్టైజ్‌మెంట్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.